# స్పెషల్ ఆర్టికల్

## మైనర్లపై అత్యాచారానికి మరణ శిక్షే

దేశంలో మహిళలు చిన్నారులపై పెరిగిపోతున్న అత్యాచారాలను కట్టడిచేసేందుకు కేంద్ర కేబినెట్ కొత్త చట్టాలను అమలుకుతెస్తోంది. 12 ఏళ్లలోపు చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడిన నిందితులకు మరణశిక్ష విధించేందుకు వీలుగా క్రిమినల్ చట్టాలను సవరించే బిల్లును ఎన్‌డిఎ ప్రభుత్వం వర్షాకాల సమావేశాల్లోనే ప్రవేశపెట్టేందుకు నిర్ణయించింది .

- ఈమేరకు కేంద్ర కేబినెట్ సైతం ఆమోదం తెలిపింది. ఆరోపణలు రుజువైన పక్షంలో కనీసంగా ఏడేళ్లనుంచి పదేళ్లపాటు కఠిన కారాగారశిక్ష విధిస్తారు. నిందితులకు అవసరమైతే మరణశిక్షనుసైతం విధిస్తారు
- ఇందుకు సంబంధించి రూపొందించిన ముసాయిదా బిల్లు కేంద్ర హోం శాఖ కేబినెట్‌కు అందచేసింది.
- క్రిమినల్ లా సవరణ ఆర్డినెన్స్‌ను ఏప్రిల్ 21, 2018వ తేదీ నుంచి అమలు చేసారు. కతువాలో జరిగిన చిన్నారి బాలికపై అత్యాచారం హత్యకు సంబంధించి భారీ ఎత్తున నిరసనలు వెల్లువెత్తి అధికార ప్రభుత్వంపై విరుచుకుపడటంతో ప్రభుత్వం అప్పటికప్పుడు ఆర్డినెన్స్‌ను అమలుచేసింది. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో కూడా ఒక యువతిపై సాక్షాత్తూ బిజెపి ఎమ్మెల్యే అత్యాచారానికి ఒడిగట్టాడు. దీనితో కొత్తగా క్రిమినల్ న్యాయచట్టాలను సవరించిన బిల్లును ప్రవేశపెడుతున్నారు. మహిళలపై అత్యాచారం జరిగితే ఏడునుంచి పదేళ్లపాటు శిక్ష ఉంటుంది. అవసరమైతే జీవితఖైదుకు పొడిగిస్తారు. 12 ఏళ్లలోపు బాలికపై అత్యాచారంచేసిన వారికి మరణశిక్షను విధిస్తారని అధికారులు వెల్లడించారు. 16 ఏళ్లలోపు బాలికఅయితే కనీసం పదినుంచి 20 ఏళ్లవరకూ శిక్ష ఉంటుంది.
- అవసరమైతే జీవితాంతం ఖైదు విధిస్తారు. ఇక 16 ఏళ్లలోపు బాలికపై సామూహిక అత్యాచారం జరిగితే జీవితం మొత్తం జైలులోనే గడిపేటట్లు శిక్ష ఉంటుంది.
- అలాగే 12 ఏళ్లలోపు బాలిక అయితే 20 ఏళ్లు కనిష్టంగాను జీవితం మొత్తం ఖైదు, లేదా మరణశిక్షను అమలుచేస్తారు. 12 ఏళ్లలోపు బాలికపై సామూహిక అత్యాచారం చేస్తే ఆతర్వాత ఆతని జీవితం మొత్తం ఖైదు లేదా మరణశిక్ష ఉంటుందని కొత్తచట్టం నిర్దేశిస్తోంది.
- అంతేకాకుండా కేసులను సత్వరమే విచారణ పూర్తిచేయాలి. అన్ని కేసుల్లోనూ రెండు నెలల్లోపే విచారణ పూర్తి కావాల్సి ఉంది. అన్ని అత్యాచారాల కేసుల్లో విచారణలు రెండునెలలు అప్పీళ్లు ఆరు నెలల్లోపు పూర్తిచేయాలని సూచించింది. ఈ కేసుల్లో నిందితులకు ఎలాంటి ముందస్తు బెయిల్ సౌకర్యం లేదు. 16 ఏళ్లలోపు వారికి ముందస్తు బెయిల్ ఇవ్వరు. బాధితుల కుటుంబీకులకు, పబ్లిక్‌ప్రాసిక్యూటర్‌లకు 15 రోజుల వ్యవధితో నోటీస్ ఇస్తారు. బెయిల్‌పై నిర్ణయం తీసుకునే ముందు పిపి, బాధిత కుటుంబ ప్రతినిధి అభిప్రాయం తీసుకుంటారు.

**చట్టాల సవరణ..విధాన సంస్కరణ**

- నిర్భయ ఘటన తర్వాత దేశంలో మహిళల రక్షణ దిశగా న్యాయసంస్కరణలపై తీవ్ర చర్చ జరిగింది. దేశవ్యాప్తంగా పెల్లుబుకిన ప్రజాగ్రహంతో విధానపరమైన, చట్టపరమైన అనేక మార్పులు చోటుచేసుకున్నాయి.
- లైంగికదాడుల ఘటనల నివారణకు, మహిళల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శకాలను సూచించాల్సిందిగా ఆదేశిస్తూ ప్రభుత్వం జస్టిస్ వర్మ కమిషన్, జస్టిస్ ఉషామెహ్రా కమిషన్లను ఏర్పాటు చేసింది.
- వారి సూచనల ఆధారంగా నూతన చట్టాలను ప్రభుత్వాలు రూపొందించగలిగాయి.

**జస్టిస్ వర్మ కమిషన్:**

- జేఎస్ వర్మ నేతృత్వంలో 2012 డిసెంబర్ 23న ఈ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. లైంగికదాడికి సంబంధించి నేరశిక్షాస్మృతిని సవరించాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా దోషులకు త్వరితగతిన శిక్ష పడేలా చేయాలని ప్రతిపాదించింది.
- ఇందుకోసం అనేక మార్పుల్ని సూచిస్తూ 2013 జనవరిలో 644 పేజీల తుదినివేదికను కమిషన్ అందజేసింది. లైంగికదాడి అంటే మర్మాంగాలు, నోరులోకి చొరబాటు మాత్రమే అనే అర్థాన్ని కమిషన్ మార్చేసింది.
- అంగీకారానికి విరుద్ధంగా లైంగికస్వభావంతో కూడిన ఏ చర్యనైనా రేప్‌గా పరిగణించాలని సూచించింది. వైవాహిక లైంగికదాడిని కూడా నేరంగానే గుర్తించాలని ప్రతిపాదించింది. పాఠశాలస్థాయి నుంచే లైంగికవిద్యను బోధించాలని సూచించింది.

**2013లో చట్టసవరణ:**

- నేరశిక్షాస్మృతి, పోక్సో, ఐపీసీల్లో సవరణలు చేస్తూ తెచ్చిన కొత్త చట్టం 2013 ఫిబ్రవరి నుంచి అమల్లోకి వచ్చింది. లైంగికదాడి నిర్వచనాన్ని మరింతగా విపులీకరించారు.
- ఈ చట్టసవరణ దోషులకు శిక్షలను మరింత కఠినతరం చేసింది. దోషులకు మరణశిక్షను కూడా విధించే అవకాశమిచ్చింది.
- శారీరకంగా ప్రతిఘటించకపోవడం లైంగికదాడికి అంగీకారం తెలిపినట్లు కాదని స్పష్టంచేసింది. మర్మాయవాల వదులును పరీక్షించేందుకు జరిపే టెస్టుల్ని ఎత్తివేసింది.

**జువైనల్ చట్టం:**

- మైనర్లయినంత మాత్రాన తీవ్రమైన నేరానికి పాల్పడిన దోషుల్ని ఎందుకు విడిచిపెట్టాలన్న తీవ్రమైన ప్రశ్నను నిర్భయ ఘటన తెరపైకి తెచ్చింది.
- 18ఏండ్ల కన్నా కొన్ని నెలల తక్కువ వయసున్న దోషి కేవలం మూడేండ్లపాటు జువైనల్ హోంలో గడిపి విడుదలైన నేపథ్యంలో జువైనల్ చట్టానికి 2015లో ప్రభుత్వం సవరణలు చేసింది.
- దారుణమైన నేరాలకు పాల్పడిన 16-18 మధ్యవయస్కులైన

వారిని కూడా మేజర్లుగానే పరిగణించాలని ఈ చట్టసవరణ చెబుతున్నది.

**అత్యాచార బాధితులకు 10లక్షల వరకూ పరిహారం**

- ❖ సామూహిక అత్యాచారానికి గురైన బాధితులకు ఇకపై కనిష్ఠంగా రూ. 5 లక్షలు, గరిష్ఠంగా రూ. 10 లక్షల పరిహారం అందించేలా సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలిచ్చింది.
- ❖ ఈమేరకు లైంగిక దాడులు, ఆమ్ల దాడులకు గురైన మహిళలకు అండగా జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ(నల్సా) ప్రతిపాదనలకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోనూ ఈ పథకాన్ని అమలు చేయాల్సిందిగా జస్టిస్ మదన్ బి.లోకుర్, జస్టిస్ దీపక్ గుప్తలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది.
- ❖ నల్సా ప్రతిపాదించిన పథకం మేరకు – అత్యాచారాలు, అసహజ లైంగిక దాడులకు గురైనవారికి రూ.4 లక్షల నుంచి 7 లక్షల వరకు పరిహారం అందిస్తారు.
- ❖ ఆమ్లదాడులకు గురై ముఖం రూపు కోల్పోతే రూ.7–8 లక్షలు, 50 శాతానికి మించి గాయపడితే రూ.5–8 లక్షలు అందజేస్తారు. అలాగే 50 శాతం లోపు, 20 శాతం కంటే ఎక్కువ గాయపడిన వారికీ పరిహారం ఇవ్వాల్సి ఉంటుంది.
- ❖ కాలిన గాయాలతో రూపు కోల్పోతే రూ.7–8 లక్షలు, అత్యాచారాలకు గురైన గర్భిణులకు రూ.3–4 లక్షలు, లైంగిక దాడులకు గర్భాన్ని కోల్పోతే రూ.2–3 లక్షల పరిహారం అందుతుంది.

**ప్రభావం:**

- ❖ ఢిల్లీ ఘటన తర్వాత ప్రజల దృక్కోణంలోనూ, ప్రభుత్వ పరిశీలనల్లోనూ చాలా మార్పులు వచ్చాయి. లైంగిక దాడుల్ని ప్రజలు సాదాసీదా వ్యవహారంగా తీసుకోవడం మానేశారు.
- ❖ ప్రభుత్వం కూడా అలాంటి ఆరోపణలు, ఘటనలు తెరపైకి వచ్చినప్పుడు సీరియస్‌గానే స్పందిస్తూ వస్తున్నది. లైంగికదాడుల ఘటనలపై ఫిర్యాదు చేసేందుకు బాధితులు నిస్సంకోచంగా ముందుకు వస్తుండడంతో ఫిర్యాదుల సంఖ్య పెరిగింది.
- ❖ అదే సమయంలో దేశంలో నేరాల రేటును సామాజిక, రాజకీయ, న్యాయపరమైన సంస్కరణలు ఏమాత్రం తగ్గించలేకపోయాయన్న వాస్తవాన్ని ఇటీవల పెరిగిపోతున్న కతువా తరహా దారుణ ఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి.

**వ్యవస్థల క్షాళనతోనే మహిళలకు భరోసా**

- ❖ నేరస్తుడి సంస్కరణే శిక్ష పరమావధి. ఇతరులు మళ్ళీ అటువంటి తప్పులు చేయకుండా నిరోధించేదిగా అది ఉండాలి. అత్యాచారాన్ని ఏ నాగరిక సమాజమూ అంగీకరించదు. అందుకే 'పోక్సో', 'నిర్భయ' చట్టాలను, ప్రస్తుత చట్టాలను తీసుకువచ్చారు.
- ❖ 2012లో 'పోక్సో' చట్టాన్ని తీసుకువచ్చారు. ఈ చట్టం 18 ఏళ్ల లోపువారిని పిల్లలుగా గుర్తించింది. నిర్భయ చట్టం అత్యాచారాలకు పాల్పడే వారికి శిక్షను కఠినతరం చేసింది. ఈ చట్టం రావడానికి ముందు గరిష్ఠంగా ఏడేళ్ల శిక్ష విధించే అవకాశం ఉండేది. నిర్భయచట్టం దీన్ని యావజ్జీవ కారాగారంగా మార్చింది. జస్టిస్ వర్మ కమిటీ మాత్రం ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప మరణశిక్ష విధించడానికి అంగీకరించలేదు. నిర్భయ చట్టానికన్నా ముందు మూకుమ్మడి అత్యాచారానికి పదేళ్ల శిక్ష ఉంటే నిర్భయ చట్టంలో 20 ఏళ్లకు పెంచారు. అత్యాచారం వల్ల బాధితులు మరణించినా, జీవచ్ఛవాలుగా మారినా అంతకుముందు అత్యాచారానికి ఏడేళ్ళ, హత్య చేసినందుకు యావజ్జీవం నుంచి మరణదండన దాకా శిక్షవిధించే అవకాశం ఉండేది. నిర్భయచట్టం దీన్ని 20 ఏళ్ల యావజ్జీవ శిక్ష లేదా మరణదండనగా మార్చింది.
- ❖ **సత్వర శిక్షలవైపు అడుగులు** నిర్భయ ఘటన జరిగినప్పుడు అప్పటి యూపీఏ ప్రభుత్వం మాదిరిగానే– అసీఫా ఉదంతం వెలుగుచూడగానే పన్నెండేళ్లలోపు బాలికలపై అత్యాచారానికి మరణశిక్ష విధించాలని మోదీ ప్రభుత్వం గత నెల 23న అత్యవసరాదేశం (ఆర్డినెన్స్) జారీ చేసింది. నిర్భయ ఉదంతం తరవాత ఆరు రోజుల్లోనే అప్పటి ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్.వర్మ నేతృత్వంలో కమిటీని నియమించి నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని కోరింది. మరో మాజీ న్యాయమూర్తి లీలాసేత్, ప్రముఖ న్యాయవాది గోపాల్ సుబ్రహ్మణ్యం సభ్యులుగా గల కమిటీ 29 రోజుల్లో నివేదిక అందజేసింది. చట్టాన్ని అమలు చేసే వ్యవస్థల లోపమే అత్యాచారాలకు కారణమని కమిటీ తేల్చింది. అప్పటి ప్రతిపక్ష నాయకురాలు సుష్మాస్వరాజ్ అత్యాచారం చేసినవారికి మరణశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. 2002లో అప్పటి ఉపప్రధాని, భాజపా సీనియర్ నాయకుడు ఎల్‌కే అద్వాణీ, ప్రస్తుత కేంద్ర మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి మేనకాగాంధీ, దిల్లీ మహిళా కమిషన్ అధ్యక్షురాలు స్వాతీ మలివాల్ అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.
- ❖ చట్టం లోని కొన్ని అంశాలు మంచివే. ఇలాంటి కేసుల్లో రెండు నెలల్లోగా విచారణ పూర్తి చేయాలని, ఆరు నెలల్లోగా అప్పీలు చేసుకోవాలని పేర్కొనడం సానుకూల చర్యే. పాత చట్టాల ప్రకారం ఆరునెలల్లోగా దర్యాప్తు జరగకపోతే నిందితుడికి జామీను వచ్చే అవకాశం ఉంది. అత్యాచారాల నిగ్గు తేల్చడానికి అన్ని రాష్ట్రాల్లో ప్రత్యేక ఫోరెన్సిక్ ప్రయోగశాలలు, పోలీసుస్టేషన్లలో, ఆసుపత్రుల్లో ప్రత్యేక ఫోరెన్సిక్ కిట్లు అందుబాటులో ఉంచడం, కేసుల సత్వర విచారణకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటు వంటివి మంచి ప్రతిపాదనలే. నిజానికి 2012 నాటి పోక్సో (బాలికలపై లైంగిక అత్యాచారాల నిరోధక) చట్టమే ప్రత్యేక కోర్టుల ఏర్పాటుకు వీలు కల్పించింది. తాజా చట్టం వీటిని మరింత విస్తరించడానికి ఉపకరిస్తుంది. సత్వర విచారణ కోసం న్యాయస్థానాల ఏర్పాటు త్వరగా జరిగే పనికాదు. కిందిస్థాయి నుంచి సర్వోన్నత న్యాయస్థానం దాకా ఖాళీల భర్తీలో జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో వందలాది ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి, న్యాయమూర్తులను నియమించడం ఎంతవరకు ఆచరణ సాధ్యమన్నది ప్రశ్న.
- ❖ కేవలం కఠిన శిక్షలే నేరాన్ని నిరోధించలేవు. పోక్సో చట్టం వచ్చినా దోషులకు శిక్షపడిన సందర్భాలు ఇప్పటికీ తక్కువగానే ఉన్నాయి. 2016లో పోక్సో చట్టం కింద శిక్షలు పడ్డవారు కేవలం 29 శాతమేనని నేరగణాంక సంస్థ వెల్లడించింది.
- ❖ అత్యాచారాలపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. కుటుంబ సభ్యులో, తెలిసిన వారో, బంధువులో, ఇరుగుపొరుగువారో అత్యాచారం చేసినప్పుడు కాస్త జాలి చూపే ధోరణి బాధితుల్లో ఉంటుంది. అపరిచితులు నేరాలకు పాల్పడితే మరణశిక్ష విధించాలని వాదించేవారికీ కొదవలేదు. సన్నిహితులైతే చాలా సందర్భాల్లో ఫిర్యాదు సైతం చేయడం లేదు. ఒకవేళ చేసినా విచారణ దశలో బాధితులే మాట మారుస్తున్నారు. వారిపై ఒత్తిడే దీనికి కారణం. చాలా సందర్భాల్లో అత్యాచారం చేసిన వ్యక్తి కుటుంబ సభ్యుడైతే పోలీసులు ఎఫ్ఐఆర్ (ప్రాథమిక సమాచార నివేదిక) దాఖలు చేయని ఉదంతాలు ఉన్నాయి. కన్నతండ్రే కూతురిపై అఘాయిత్యానికి పాల్పడుతున్న ఘటనలూ జరుగుతున్నాయి.

- మన దేశంలో అరుదైన సంఘటనల్లో మాత్రమే మరణశిక్ష విధిస్తున్నారు. తీవ్రవాద చర్యలకు పాల్పడేవారికి మినహా మరే సందర్భంలోనూ మరణశిక్ష విధించకూడదని న్యాయసంఘం సిఫార్సు చేయడం గమనార్హం.

**మరణదండన అమలుతో మహిళలపై హింస అంతం కాదు: ఆమ్నెస్టీ**

- మరణ శిక్షల అమలుతో మహిళలపై హింస అంతమవదని మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ పేర్కొంది. నిర్భయ కేసులో దోషుల అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చిన నేపథ్యంలో ఆ సంస్థ స్పందిస్తూ లైంగిక హింస జరగకుండా మరణ శిక్ష నిలువరిస్తుందనడానికి ఎటువంటి ఆధారమూ లేదని ఆ సంస్థ భారత ప్రతినిధి అస్మితా బసు పేర్కొన్నారు. లైంగిక దాడులు, అత్యాచారాలకు సంబంధించిన చట్టాల్లో సంస్కరణలకు ఆధారంగా తీసుకున్న జస్టిస్ వర్మ కమిటీ సిఫార్సులు కూడా అత్యాచార కేసుల్లో మరణ దండనను వ్యతిరేకించిందని ఆమె గుర్తు చేశారు. నేరాన్ని పరిష్కరించడానికి మరణ దండనే సరైనదని భారత్‌లోని చట్టసభసభ్యులు తరచూ సమర్థిస్తుంటారని, బాధిత కుటుంబాలకు మద్దతుగా నిలవడం, విచారణలు, దర్యాప్తులను మెరుగుపర్చడం వంటి సమర్థమైన పరిష్కారాలను వారు విస్మరిస్తారని అన్నారు.

**సామాజిక మార్పులు కీలకం**

- అత్యాచారాల విషయంలో కేవలం చట్టాలు మాత్రమే పనిచేయవు. తాజా అత్యవసరాదేశం ప్రకారం దర్యాప్తు సత్వరం పూర్తి కావాలన్న ఆశయం మంచిదే. కానీ దానికితోడు ఇతర ఏర్పాట్లు లేనప్పుడు ప్రయోజనం శూన్యం.
- త్వరగా దర్యాప్తు పూర్తి చేయాలన్న హడావుడిలో నిర్దోషుల్ని దోషులుగా నిరూపించడానికి ప్రయత్నిస్తే, వారికి మరణశిక్ష విధిస్తే- అసలుకే మోసం వస్తుంది.
- సత్వర దర్యాప్తు సాక్ష్యాధారాలను మాయం చేయకుండా నిరోధించగలుగుతుంది. కానీ దర్యాప్తులో అవకతవకలను ఆపలేదు. అత్యాచార బాధితులకు అనేక సమస్యలుంటాయి. వారు పదేపదే విచారణకు న్యాయస్థానాలకు హాజరు కావాల్సి వస్తుంది. విచారణ ఏళ్లతరబడి కొనసాగుతుంది. ఏళ్లు గడిచేకొద్దీ ఏం జరిగిందో పూసగుచ్చినట్టు చెప్పడం అసాధ్యం.
- ఆ దశలో నిందితుడి తరఫు న్యాయవాది గుచ్చిగుచ్చి అడిగే ప్రశ్నలు అత్యాచారం కన్నా ఎక్కువ మానసిక క్షోభ కలిగిస్తాయి. న్యాయస్థానాలు సైతం అత్యాచార ఆరోపణలను నమ్మని సందర్భాలు అనేకం ఉన్నాయి. బాధితుల పేదరికం, అనారోగ్యం, ఇంట్లో చాకిరీ, గృహహింస, అవిద్య, పారిశుద్ధ్యం కొరవడటం మొదలైనవన్నీ అమ్మాయిలు ఎదుర్కొనే సమస్యలే. పోక్సో చట్టం పుణ్యమా అని అత్యాచారం జరిగిందని ఫిర్యాదు చేసేవారి సంఖ్య పెరిగింది. 2015లో ఫిర్యాదులు 10,854 ఉండగా, 2016లో 19,765కు పెరగడమే ఇందుకు నిదర్శనం. అత్యాచారానికి పాల్పడ్డ తండ్రికో, దగ్గరి బంధువుకో మరణశిక్ష భాయం అనుకున్నప్పుడు ఫిర్యాదుల సంఖ్య సైతం తగ్గిపోయే ప్రమాదం ఉంది.
- జరగాల్సింది నేరవిచారణ ప్రక్రియను సంస్కరించడం. దీనికి ఏ ప్రభుత్వానికైనా నిబద్ధత అవసరం. నిర్భయకేంద్రాలు, రవాణా కేంద్రాల్లో కెమెరాల ఏర్పాటు, ఆకస్మిక ఆపద ఎదురైతే సెల్‌ఫోన్లో ఓ మీట నొక్కే ఏర్పాటు మొదలైనవన్నీ పైపై మెరుగులుగానే మిగిలిపోతాయి. అత్యాచారం చేసేవారు ఎక్కడో ఉండరు. జనం మధ్యే ఉంటారు. అత్యాచారాలు పెరగడానికి కారణాలేమిటో, విద్యావ్యవస్థలో, నైతిక ప్రవర్తనలో ఉన్న లోపాలేమిటో ఆలోచించకుండా కేవలం ఒక్క మరణశిక్షల వల్లే ప్రయోజనం ఉండదు. ప్రస్తుత విద్యావ్యవస్థ మార్కులు, ర్యాంకుల వేటలో ఉంది. నైతిక విలువలను పూర్తిగా విస్మరిస్తోంది. స్త్రీలనే కాదు- సాటి మనిషినీ గౌరవించాలని, మానవతా విలువలకు ప్రోది చేయాలని పెద్దలు ఇళ్లల్లో, ఉపాధ్యాయులు పాఠశాలల్లో చెప్పే వాతావరణం లేకపోతే అత్యాచారాలు పెరుగుతూనే ఉంటాయి

# ఆర్థికాంశాలు

## 28% శ్లాబులో 35 వస్తువులే

వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) మండలి ఇటీవల తీసుకున్న నిర్ణయంతో అత్యధిక పన్ను శ్లాబు (28%) రేటులో ఇక 35 వస్తువులే మిగిలాయి.

- గత ఏడాది జులై 1న జీఎస్‌టీ అమల్లోకి వచ్చినప్పుడు మొత్తం 226 వస్తువులపై 28 శాతం పన్ను రేటు ఉండగా, క్రమంగా 191 వస్తువులపై పన్ను తగ్గిస్తూ వచ్చారు.
- మిగిలిన 35 వస్తువుల్లో ఏసీలు, డిజిటల్ కెమెరాలు, వీడియో రికార్డర్లు, డిష్‌వాషింగ్ మెషీన్లు, సిమెంట్, ఆటోమొబైల్ విడిభాగాలు, టైర్లు, మోటారు వాహనాలు, పడవలు, ఎయిర్‌క్రాఫ్టులు, కొన్ని రకాల పానీయాలు, పొగాకు వస్తువులు, సిగరెట్లు, పాన్ మసాలాలు తదితర వస్తువులు ఉన్నాయి.
- జీఎస్‌టీలో ప్రస్తుతం ఉన్న 5 శ్లాబు రేట్లు ఉండగా, రాబోయే రోజుల్లో మూడుకు తగ్గించే అవకాశం ఉందని జీఎస్‌టీ నెట్‌వర్క్ సంఘం అధ్యక్షుడు సుశీల్ మోదీ తెలిపారు.

# డిఫెన్స్ & సెక్యూరిటీ

## తుపాకీ లైసెన్సుదారులకు ఇక విశిష్ట గుర్తింపు సంఖ్యలు

దేశవ్యాప్తంగా తుపాకీ లైసెన్సుదారులందరి పేర్లతో వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి సమగ్ర సమాచారాన్ని (నేషనల్ డేటాబేస్) రూపొందించనున్నట్లు కేంద్ర హోంశాఖ వెల్లడించింది.

- ఇందులోని వ్యక్తులందరికీ (పాతవారు, కొత్తవారైనా..) విశిష్ట గుర్తింపు సంఖ్య (యూఐఎన్)ను కేటాయించనున్నారు.
- ప్రైవేటుగా తుపాకీ అనుమతులున్నవారిలో చాలామంది తరచూ నేరాలకు పాల్పడటం లేదా వేడుకల్లో కాల్పులు జరపడం వంటి చర్యలతో పలువురు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర హోంశాఖ చర్యలు చేపడుతోంది.
- తుపాకీ అనుమతి ఉన్న ప్రతిఒక్కరూ తమ వివరాలను డేటాబేస్‌లో నమోదు చేసుకుని యూఐఎన్‌ను పొందాల్సి ఉంటుందని తెలిపింది.
- 2019 ఏప్రిల్ 1 తర్వాత యూఐఎన్ లేని తుపాకీ అనుమతులన్నీ రద్దవుతాయని స్పష్టం చేసింది. చట్టం ప్రకారం వీటిని 'ఆయుధాల (రెండో సవరణ) నిబంధనలు, 2018' గా పిలుస్తారు.
- ఎవరికైనా ఒకటి కంటే ఎక్కువ అనుమతులుంటే – అలాంటి వారంతా ఆ ఆయుధాలన్నింటికీ (తమ యూఐఎన్ కింద) ఒకే అనుమతి పొందేందుకు గాను దరఖాస్తు (ఫారమ్ 3) చేసుకోవాల్సి ఉంటుంది.

# భారత్-ప్రపంచం

## రువాండా లో మోదీ

భారత ప్రధాని నరేంద్రమోదీ మూడు ఆఫ్రికా దేశాల పర్యటనలో భాగంగా 23 జులై, 2018న రువాండా రాజధాని కిగలీ చేరుకున్నారు. ఈ తూర్పు ఆఫ్రికా దేశానికి భారత ప్రధాని రావడం ఇదే తొలిసారి.

❖ ఆఫ్రికా ఖండంలో ఆర్థికంగా వేగంగా వృద్ధి చెందుతున్న దేశంలో రువాండా గుర్తింపు పొందింది. స్వయంగా దేశాధ్యక్షుడు పాల్ కగామే విమానాశ్రయానికి వచ్చి మోదీకి ఘన స్వాగతం పలికారు.

❖ 'పేద కుటుంబానికి ఒక గోవు' (గిరింకా) పేరుతో రువాండా ప్రభుత్వం చేపట్టిన జాతీయ సామాజిక పరిరక్షణపథకంలో మోదీ పాల్గొ న్నారు. భారత్ తరఫున రువాండాలో 200 ఆవుల్ని కొని ఈ పథకం కింద బహుమతిగా అందించారు.

❖ 1994 తరువాత ఆదేశంలో భారీ సంఖ్యలో పశువులు మృత్యువాత పడ్డాయి. వ్యూహాత్మక ఒప్పందంలో భాగంగా ఆ దేశంలో పశు సంపదను పెంచడంలో భాగంగా భారత ప్రభుత్వం వాటిని అందజేసింది.

❖ రక్షణరంగ సహకార ఒప్పందంపై రెండు దేశాలూ సంతకాలు చేశాయి. కిగలీ ప్రత్యేకార్థిక మండలికి 10 కోట్ల డాలర్లు (సుమారు రూ.680 కోట్లు), వ్యవసాయం-సాగునీరుకు మరో 10 కోట్ల డాలర్లు రుణం రూపేణా భారత్ సమకూర్చనుంది.

❖ రక్షణ, పాడిపరిశ్రమ రంగాల్లో సహకారం, తోళ్ల పరిశ్రమ, వ్యవసాయం, సాంస్కృతిక రంగాల్లో ఒప్పందాలు కుదిరాయి.

❖ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఇటీవల ఈ దేశంలో పర్యటించిన నేపథ్యంలో మోదీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకొంది. రువాండా పర్యటన ముగించుకుని మోదీ ఉగాండా బయల్దేరారు. భారత ప్రధాని ఆ దేశ పర్యటనకు వెళ్లడం 1997తర్వాత ఇదే తొలిసారి. దక్షిణాఫ్రికా రాజధాని జొహెన్నస్‌బర్గ్‌లో జరిగే బ్రిక్స్ దేశాల 10వ శిఖరాగ్ర సభలోనూ మోదీ పాల్గొన్నారు.

## అరుణాచల్-టిబెట్ సరిహద్దులో మానవ రహిత వాతావరణ కేంద్రం నెలకొల్పిన చైనా

అరుణాచల్‌ప్రదేశ్-టిబెట్ సరిహద్దులో 'మానవ రహిత స్వయంచాలిత వాతావరణ పరిశీలన కేంద్రా'న్ని చైనా నెలకొల్పింది.

❖ వాతావరణ పరంగా తమ సైనిక బలగాలకు కావాల్సిన సమాచారాన్ని అందించడం దీని ప్రధానోద్దేశం. ప్రాంతీయంగా ఏమైనా ఘర్షణలు తలెత్తితే విమానాలు, క్షిపణుల కార్యకలాపాలకు సహకరించడం కూడా మరో ఉద్దేశమని ప్రభుత్వ పత్రిక 'గ్లోబల్ టైమ్స్' వివరించింది.

❖ గాలి దిశ, వేగం, పీడనం, తేమ వంటి వివరాలను మునుపటి కంటే కచ్చితత్వంతో అంచనా వేయడం ఇప్పుడు సాధ్యమేనని తెలిపింది.

❖ యుద్ధ సమయంలో విమానాలు ఎగరాలన్నా, దిగాలన్నా, క్షిపణిని ప్రయోగించాలన్నా ప్రాంతీయ వాతావరణం ఎంతో ముఖ్యమైన అంశమనీ, ఆ వివరాలను ప్రాంతీయ కేంద్రం అందిస్తుందనీ సైనిక నిపుణుడు సొంగ్‌ఝోంగ్‌పింగ్ తెలిపారు.

## బహ్రెయిన్‌లో భారత దౌత్య కార్యాలయాన్ని ప్రారంభించిన సుష్మ

బహ్రెయిన్‌లో భారతీయ దౌత్య కార్యాలయ నూతన సముదాయాన్ని విదేశాంగ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ప్రారంభించారు.

❖ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...భారత్, బహ్రెయిన్‌ల మధ్య ఏనాటినుంచో చక్కటి సత్సంబంధాలు కొనసాగుతున్నాయన్నారు.

❖ ఉభయ దేశాల మధ్య ఉన్న సన్నిహిత సహకారానికి ఈ దౌత్యకార్యాలయ సముదాయం ఏర్పాటు అద్దం పడుతోందని ఆమె ఉద్ఘాటించారు.

❖ రెండు రోజుల పర్యటన నిమిత్తం సుష్మాస్వరాజ్ ఇక్కడికి వచ్చారు. బహ్రెయిన్‌లో సుష్మాస్వరాజ్ పర్యటించడం ఇది మూడోసారి.